# పన్నీరులో కన్నీరు

— డా॥ మంతెన సూర్యనారాయణ రాజు

మేరేజ్ రిసెప్షన్‌కి వచ్చినవాళ్ళనందర్నీ ఆయనగారు కలుపుగోరుతనంగా పలకరిస్తున్నాడు. మాటల మధ్యలో హుషారుగా జోకులు పేలుస్తున్నాడు. నలభై అయిదు, ఏభై ఏళ్ళ మధ్య వుంటుంది వయస్సు. కొందరికి గంధపు గిన్నె అందిస్తూ, కొందరిపై పన్నీరు జల్లుతున్నాడు. వధూవరులను ఆశీర్వదించేవాళ్ళకి అక్షింతలు ఇస్తున్నాడు. కొందరికి గులాబీ పువ్వుల్ని అందిస్తున్నాడు. అక్కడ ఆహ్వానించే స్త్రీ పురుషులలో అతనిదే పైచేయి. మగపెళ్ళివారు అమ్మాయి తాలుకు వేలు విడిచిన బావగారేమో అనుకున్నారు. అమ్మాయి తరపున వచ్చినవాళ్ళు అబ్బాయితాలూకు దూరపు చుట్టం, ఏబాబాయో అయ్యుంటాడు అనుకున్నారు. చాలాసేపటివరకూ ఎవరికీ ఎటువంటి అనుమానం రాలేదు. వచ్చే అవకాశం అతను వాళ్ళకు కల్గించలేదు. మధ్యలో ఒకసారి బాత్రూమ్‌కెళ్ళి తిరిగొచ్చాడు. పార్టీకొచ్చి అతనికి షేక్‌హేండిచ్చిన వ్యక్తి ఒకరు ''నాహేండ్ చైన్ రెండు కాసులది పోయింది'' అంటూ ఖంగారుపడ్డాడు. నలుగురూ ఆయనగార్ని ఇంటి దగ్గర వదిలేసి వుంటావు బాగా గుర్తు చేసుకోమని సలహా ఇచ్చారు.

పెళ్లికుమార్తె తాలుకు స్నేహితులు, చుట్టాలూ దండిగా వచ్చారు. అందరూ భోజనాల దగ్గర కూర్చున్నారు. అతను ఇప్పుడు మగవాళ్ళు భోంచేస్తున్న లైన్ దగ్గరకొచ్చాడు. నేతిపాత్ర తీసుకుని వడ్డిస్తున్నాడు. కొసరి కొసరి మరీ వడ్డిస్తున్నాడు. లేడీస్‌వైపు మరో వ్యక్తి నెయ్యి వడ్డిస్తుంటే ఆ పాత్ర తాను తీసుకుని ఖాళీది అతనికిచ్చి మిమ్మల్ని ఎవరో పిలుస్తున్నారని చెప్పి వడ్డించడంతో మునిగిపోయాడు. అడిగి అడిగి వరసలు పెట్టి అప్యాయంగా వడ్డన చేస్తున్నాడు.

స్త్రీ పురుషులు భోజనాలు ఆరగిస్తున్నారు. స్త్రీలలో సోదెమ్మలు మధ్య మధ్య కబుర్లతోబాటుగ కాట్లాడుకున్నంత పని చేసి తిరిగి కలిసిపోతున్నారు.

వడ్డన, మర్యాదల విషయంలో ఆధిక్యత వెలగబెట్టడం రివాజేకదా. పెళ్ళికొచ్చినవాళ్ళ సెంట్ల ఘుమఘుమలు, నవ్వుల కిలకిలలతో ఆ హాలంతా నిండిపోయింది. ఒకామె తన మెడతాడు చూసుకుంటూ ''అమ్మో! నా ఏడుకాసుల చంద్రహారాల గొళుల్సు...'' అంటూ బేర్‌మంది.

ముందు నెయ్యి వడ్డించిన వ్యక్తి ఆవలివ్యక్తితో మాటాడి తిరిగి రాగానే నేతిపాత్ర తిరిగి తీసుకున్నాడు. ఆమె అంతమందిలో లేచి నిలబడి ''ఇందాక నెయ్యి వడ్డించింది నువ్వేకదా!'' అంటూ అడిగింది. భోజనం మానేసి ఆమె అలా అడగడంతో ఖంగారుపడి అతడు ''అవునండి, అబ్బే! మీకు నేను వడ్డించలేదే!'' అంటూ తడబడుతూ సమాధానం చెప్పాడు. ఆమె రంకెలేస్తున్నట్లు గొంతుపెంచి ''రాస్కెల్! నామెడమీద ఏదో పురుగు పాకుతోందని చెయ్యిపెట్టి నువ్వేగా దాన్ని కాజేసింది. నిజం చెప్పు.'' అంది.

అందరికళ్ళూ అతగాడి మీద పడ్డాయి. పెళ్ళికుమార్తె తండ్రి గుండెలు గొక్కుంటూ అక్కడికొచ్చి నెమ్మదిగా ''ఏవిటమ్మా! కాస్త మర్యాదగా, నెమ్మదిగా మాట్లాడు. ఇది మర్యాదస్తులతాలూకు పెళ్ళి. ఆయనెవరనుకుంటున్నావు? నా పెద్దల్లుడు. బ్యాంకులో కేషియర్. సభ్యతగా మాట్లాడ్డం చేతగానివాళ్ళిటువంటి పార్టీలకు రాగూడదు. ఇప్పటికే నలుగురూ భోజనం మాని ఇటు చూస్తున్నారు. ఎక్కడ పడేసుకున్నావో బాగా గుర్తుచేస్కో.'' అంటూ ముఖం చిట్లించి అల్లుణ్ణి కూడా తీసుకు చక్కాపోయాడు.

ఆవిడ కాస్త తన దూకుడు తగ్గించుకుంది. కాని ఆమె కళ్ళల్లో నీళ్ళు పైకి ఉబికి జలపాతాల్లా జారిపడుతున్నాయి. పెళ్ళికుమార్తె బావగారైన ఆవ్యక్తి మళ్ళీ ఆమె దగ్గరకు వచ్చాడు. ''మేడం! నేను మీకు ముందు నెయ్యి వడ్డించిన వాణ్ణికాదు. ఒకాయన టక్ చేసుకొచ్చి నాచేతిలో పాత్ర లాక్కున్నాడు. ఆయనయ్యుంటాడు. మీరు ఎవర్ని చూసి ఎవరనుకుంటున్నారో?'' వినయం వుట్టిపడేలా నెమ్మదిగా చెప్పాడు.

''ఆ! ఆ! వాడే అయ్యుంటాడండి. ఎక్కడున్నాడో... ప్లీజ్! కాస్త ఆచూకీ తియ్యండి. మాఆయనకి ఈ విషయం తెలిస్తే అసలు ఊరుకోరు. పైగా అది ఆయనకి తెలీకుండా ప్రక్కింటి వనజాక్షిగార్ని అడిగి ఎరువు తెచ్చి వేసుకున్న నగ'' అంటూ కళ్ళు వత్తుకుంటూ బావురుమంది.

''అలాగే!'' అంటూ అతగాడు నేతిపాత్ర మరొకరికిచ్చి ముందు తనదగ్గర నేతిపాత్ర పుచ్చుకున్న వ్యక్తి కోసం గాలించసాగాడు. అతగాడు కనిపించలేదు.

చెమటలు కక్కుకుంటూ తిరిగి వచ్చి ''సారీ! మేడమ్! వాడెక్కడా కనిపించలేదు. బహుశా ఇక్కడే ఎక్కడో దాగివుంటాడు. ముందు భోజనాలు కానివ్వండి.'' అంటూ చక్కా వెళ్ళిపోయాడు. టక్ చేసుకున్న వ్యక్తులు ఎందరో వచ్చారు. ఎవరని జ్ఞాపకం ఉంటుంది. ముఖం పోల్చుకోవడం మరీ కష్టం. అందరూ సుష్ఠుగా భోజనాలు చేశారు. కిళ్ళీలు నములుతున్నారు. కొందరు సిగరెట్లు తగలేస్తున్నారు. వచ్చినవాళ్ళలో చాలామంది వధూవరులతో, వారి తల్లిదండ్రులతో చెప్పి సెలవు తీసుకుని వెళ్ళిపోతున్నారు. పిల్ల తండ్రి పెళ్ళి కుమారుడితో ''అల్లుడుగారూ! మీ కుడి ప్రక్క నుండి పన్నీరు జల్లినాయన మీకేమౌతారండీ'' అని అడిగాడు ఉండబట్టలేక.

''అరే! అతనెవడో నాకు తెలియదండీ. మీకు కావలసిన దగ్గర చుట్టమేమో అనుకున్నాను. ఇంతకీ ఎందుకడుగుతున్నారు?'' అన్నాడు అనుమానంగా.

''బాగుంది వరస. మీ చుట్టమని మేమూ! మా చుట్టమని మీరూ మోసపోయాం. మీతాలుకామె మెడలో చంద్రహారాల గొలుసు, మాతాలూకాయన చేతి చైన్ రెండూ పోయాయి. బహుశా వాడేకొట్టేసి ఎక్కడికో చెక్కేసి ఉంటాడు. ఇంకెక్కడ దొరుకుతాడు. ఈమధ్య ఇటువంటి గొడవలు ఎక్కువయ్యాయి'' అంటూ గొణుక్కున్నాడు.

''మావయ్యా! పోలీసులకు ఫోన్ చెయ్యండి. ఆవిడ ఏడుస్తోంది.'' అన్నాడు పెళ్ళికుమారుడు.

''మాతిప్పలేవో మేం పడతాంగాని, మీరూ అమ్మాయి లోనికెళ్ళి బట్టలు మార్చుకోండి.'' అంటూ వాళ్ళని లోనికి పంపించేశాడు. తాను చుట్టాల్నీ, మిత్రుల్నీ సాగనంపుతూ ఉండిపోయాడు.

• • •

ఫంక్షన్ పూర్తయ్యింది. అందరూ దాదాపు వెళ్ళిపోయాక లెట్రిన్‌లోనుంచి టకప్ పెద్దమనిషి బయటికొచ్చాడు. పనిమనుషులు టేబుల్స్ క్లీన్ చేస్తున్నారు. అతగాడిని ఎవరూ గమనించలేదు.

కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుని మెల్లిగా జారుకుంటూండగా గేటు దగ్గర ఎవరితోటో సుదీర్ఘ సుత్తివేస్తున్న చంద్రహారాలు పోగొట్టుకున్నామె అతగాణ్ణి గుర్తించింది. వెంటనే పరుగులాంటి నడకతో వెళ్ళి కాలర్ పట్టుకుని ఆపింది.

అక్కడ మిగిలింది కొద్దిమందే అయినా ఒక ఆడది మగాడి కాలర్ పట్టుకుంది అనేటప్పటికి అందరి దృష్టీ అతనిమీదికే పోయింది. కోపంగా ''ఏరా! రాస్కెల్! నాగొలుసు దొంగిలించింది నువ్వుకదూ!'' అంటూ ఎడంకాలి చెప్పు తీసి చెంప మీద కొట్టింది. అతగాడివి కట్టుడుపళ్ళేమో కళ్ళజోడుతోబాటు అవీ ఊడి క్రిందికి పడ్డాయి. నోటంటా చొంగ కారుస్తూ

''నాకేం తెలీదు.'' అంటూ బుకాయించబోయాడు.

''ఏం తెలీదూ!'' అంటూ ఇంకోటి కొట్టబోయింది.

''ఆగండమ్మా! నన్ను కొట్టకండి. నేను దొంగను కాను. నాబిడ్డడిని కాపాడుకోవడంకోసం నేనీపని చేశాను. వాడికి థ్రోట్ కేన్సర్. ఆపరేషన్ చేయించినా ఫలితం కనిపించడంలేదు. ఆరునెలల నుంచి వైద్యం చేయిస్తున్నాను. ఫలితం శూన్యం. నేనొక మూర్ఖ పేషెంట్ని. నాకోసం నా బిడ్డకోసం ఇల్లు, నా భార్య మెళ్ళో సూత్రాలతో సహా అన్నీ అమ్మేశాను. డాక్టర్ పదివేలు తెమ్మన్నాడు. నాకు ఈ దారిద్ర్యంలో దిక్కుతోచక, వాణ్ణి కాపాడుకోవాలని ఈపని చేశాను.'' అంటూ దాచిన హేండ్‌చైన్, చంద్రహారాల గొలుసూ వాళ్ళకిచ్చేశాడు. కళ్ళంటా వస్తున్న నీటికి ఆపేలేదు. అతనిప్పుడో శోకదేవుడిలా ఉన్నాడు.

నలుగురూ గుమిగూడారు. అతనిపట్ల జాలి ప్రదర్శించారు. కొందరు వీడిని పోలీసులకు అప్పజెప్పాలన్నారు. పెళ్ళికూతురు బావగారైన, పెద్దల్లుడు ''వద్దు మావయ్యా!'' అంటూ సింపథీ చూపాడు. వెంటనే జేబులోది వంద నోటు తీసి ఇచ్చాడు ఆవ్యక్తికి. తను తెచ్చుకున్న ఎరువు నగ దొరికినందుకు ఆనగ తీసుకుని ఆమె ఆనందంగా ఇంటికెళ్ళిపోయింది. ఆ వ్యక్తి తన జబ్బుతాలూకు, కొడుకు జనరల్ హాస్పత్రిలో వైద్యం చేయించుకొంటున్న దాఖలా సర్టిఫికేట్లు చూపాడు. అంతా అతనిపట్ల బాధపడ్డారు. తలో వందా మిగిలిన వాళ్ళూ ఇవ్వడంతో అతను తీసుకోవడానికి బిడియపడ్డాడు. ''ఐయాం నాట్ ఎ బెగ్గర్! నన్ను అరెస్టు చేయించండి. కనీసం ఆ బాధలన్నా చూడ్డం తప్పుతుంది.'' అంటూ బావురుమన్నాడు.

అతను ఆనందంగా అందరి మీదా తన బాధలన్నీ మర్చిపోయి పన్నీరు జల్లుతుంటే నిజంగా ఏ చీకూ చింతా లేని మనిషనుకున్నారు. నిజానికి అతను జల్లింది పన్నీరు కాదు. తన దీనస్థితి అనే కన్నీటిని పన్నీరుగా చేసి ఆ కొద్దిసేపూ పెళ్ళివారి మధ్య పన్నీట్లో కన్నీరు కుపిరించాడనుకున్నారు. పిల్లతండ్రి ఎలాగైతే వెయ్యి రూపాయలు అందరిదగ్గరదీ కలిపి బ్రతిమాలితే పుచ్చుకుని, అతగాడు అందరికీ నమస్కరించి కళ్ళజోడు, కట్టుకుపళ్ళూ తీసుకుని తనదారిన తాను వెళ్ళిపోయాడు.

★

